ఊహాకందని కథ

రాజ్యలక్ష్మికి ఒళ్లు మండింది. లేచి నుంచుంది.

'ఇదిగో కాముడూ, లోకంలో నీకొక్క దానికే కాలంవిలువ తెలుసుననీ తక్కిన వాళ్లందరూ పనీపాటా లేకుండా వీథిలో తిరుగుతున్న వాళ్లనీ నీ ఉద్దేశం కాబోలు-ఇది మూడోసారి నేను రావడం-నీ కంతగా మాట్లాడ్డానికి తీరుబడి లేకపోతే ఇక నిన్ను ఇబ్బంది పెట్టనులే'

కామేశ్వరి పకపక నవ్వింది.

'మనం సెకండ్ ఫారం చదువుతున్నప్పుడు జరిగిన సంగతి జ్ఞాపకమొస్తూం దోరాజూ, నిన్నూ నీ కోపం చూస్తూంటే....ఓసారి మనిద్దరం పుస్తకాలు పట్టుకు నడుస్తూంటే ఓ కుర్రాడు 'ఇదిగో రాజ్యలక్ష్మి' అని పిలిచాడు, జ్ఞాపకముందా? 'ఎవడ్రా ఆ పిలిచింది?' అని చేత్తో పట్టుకున్న స్కేలుతో వాడి కళ్ళు తిరిగేలా ఒక్క టంటించావు.... ఆ కుర్రాడు మొహం ఇంతచేసుకుని 'ఇదేమి టమ్మాయ్, జేబురుమాలు పారేసుకున్నావని తీసి, యిద్దామని పిలిచాను. బలే బహుమతి యిచ్చావే.... 'ఫైర్ యింజను'లా యిక ముందూ వెనకా చూసుకోడం లేదు కాబోలు' అని బుర్ర తడుముకుంటూ పోయాడు. ఆ పేరే తరవాత నీకు సార్థక నామధేయం అయింది గుర్తొచ్చిందా?'

'అయితే ఏమిటీ నువ్వనేది?'

'నిజానికి పేరయితే అలా ఉందిగాని 'ఫైర్ యింజన్' చేసే పనేమిటి? మంటలని ఆర్పడానికే కదూ అది వెళ్లేది!'

'నువ్వు సెకండ్ ఫారానికి సైన్సు చెబుతావని అందరికీ తెలుసుగాని నన్నెందుకు 'బోర్' చేస్తావ్?'

'అదుగో ఆ తొందరపాటే తగదు... ముక్కుమీద కోపం ఉంటే ఉండుగాక....మా రాజు చల్లనిరాజు. నాకు తెలియదూ? మరొక్క అరగంట ఆగుతేగాని వెన్నెలరాదు మరి' కామేశ్వరి నవ్వుతున్నది నవ్వుతున్నట్టు వెళ్లిపోయింది. హైస్కూలికి క్యాజువల్ లీవు పెట్టకపోతే మానిపోయిరి ప్రైవేటు పిల్లల్ని రెండ్రోజులు రావద్దని చెబితే వచ్చిన నష్టమేమిటో! ఏమయినా రాజ్యలక్ష్మి కోపం చప్పగా చల్లారిపోయింది. ఏమీ తోచక కాలుగాలిన పిల్లిలా అటూ ఇటూ తిరగజొచ్చింది.

ఇవతలి గదిలో కామేశ్వరి వాళ్ల

నాన్నగారు ఎవరో పెద్ద మనుషులతో మాటాడుతున్న మాటలు స్పష్టంగా వినబడుతున్నాయి.

'అయితే అబ్బాయి ఏం చదువుతున్నాడంటారు?'

'ఏమో బాబూ .... కంపెనీవాళ్ళు స్కాలర్‌షిప్ యిచ్చి పంపేరా, వెళ్ళింది దూరాభారమా, చదివేది బ్రహ్మాండమయిన చదువా, మనవాడికి చూడబోతే అఖండమయిన తెలివి తేటలా, వాళ్ళు పర్మిషన్ యివ్వాలా, వీడికి శలవు దొరకాలా, బయలు దేరాలా రావాలా....'

ఇవతలి వాళ్ళలో ఒకతను నవ్వుతూ అన్నాడు కాస్త నెమ్మదిగా....

'పంతులుగారికి వినికిడిశక్తి తగు మాత్రం తగ్గిందని తమకు మనవిచేసినట్టు జ్ఞాపకం.... కాస్త గట్టిగా శలవిస్తే ...'

'తమరే శలవియ్యండి .... నా కొంకించెం గొంతుక వెలుగురాసింది.

'అబ్బాయిగారు ఎంతవరకూ చదువుకున్నారని అడుగుతున్నారు' అని అరచాడాయన ఇంట్లో దొంగలు పడితే అరచే స్వరంతో.

'ఏమో బాబూ....విద్యకు అంతేమిటి? విజ్ఞానానికి దరేమిటి? తీసినకొద్దీ గొయ్యి పెద్దదైనట్టు చూసినకొద్దీ ప్రపంచం విశాల మౌతూంటుందిట. వెనకటికి గోపాలకృష్ణగారని అఖండమైన జ్యోతిశ్శాస్త్ర ప్రవీణుడుంటే ఆయనకిచూపించాంవీడిజాతకం.అందులోనిఅంతూ దరీ కనిపించని విద్యారేఖ చూసి ఆయన అంతటి పొడుగుపాటి ముక్కు మీదా వేలేసుకున్నాడు! అబ్బాయి చదివిన చదువు మన పల్లెటూరిలో లేక, పట్నం పంపించాం. అక్కడా లేక రాజధానికి తరలించాం. వీడికి సరిపడ్డ చదువు అక్కడా లేదండోయ్....అప్పుడు కేంద్రానికే ఫిరాయించాం. అక్కడైతే మాత్రం వీడి పాండిత్యానికి తగ్గ విశ్వవిద్యాలయాలు ఏవీ? ఆ సరస్వతమ్మ కరుణించాలిగాని మనం ఆటంకపరుస్తే మాత్రం ఆగుతారుటండీ? ప్రస్తుతం అమెరికాలో రీసెర్చి చేస్తున్నాడు-నామటుకు నేను చెప్పుకోకూడదు ... తల్లి దండ్రులకి ఖ్యాతి తెచ్చేవీళ్ళు పిల్లలుగాని కన్నవారందరూ పిల్లలుటండీ కంద పిలకలు గాని!'

'వయసెంతుంటుంది?'

'ఏమో బాబూ .... ఇంటికి అడపా తడపా పంపుతూనే ఉంటాడు సొమ్ము. ఇంకా బుద్ధిమంతుడు కాబట్టి ఇంటినుంచి సొమ్ము పంపమని రాయడు. అయినా మన దేశమా, మన ఖర్చులా? అయిదు రూపాయలు అక్కడ పెడితే గాని ఛువరమేనా చెయ్యరుట. అయినింటిబిడ్డ కాబట్టి, వ్యసనా లేవీ ఒంటబట్టలేదు కాబట్టి....మా వాడు కాబట్టి



''ఇదో మిమ్మల్నే !...ఇలా వచ్చి టైము చూసి నాకు ఆకలి వేస్తుందేమో చెప్పా లని తెలీదూ ?!......''

పంకంలో ఉన్నా పద్మంలా గడుపు కొస్తున్నాడు. మరొక డయితేనా ?'

'ఏమండోయ్ శాస్త్రుల్లుగారు, మిగిలిన భోగట్టాలు ఎవర్నైనా అడిగి తెలుసుకుందాం గాని కట్నం ఎంతో కనుక్కోండి. మన దరిదాపుల్లో ఉంటే మాటాడుకోవచ్చు-లేకపోతే యిక్కణ్ణుంచే జారుకోవచ్చు. పెళ్ళికొడుకు మాట దేముడెరుగు గాని ఈయనతో మాట్లాడేసరికి దవడలు సలుపుతున్నాయ్'

'చిత్తం కదుపుదాం ఉండండి— కిందటిసారి అరిచేసరికే నాకు కంఠనాళం కాస్త వాచినట్లయిందా' అని శాస్త్రులుగారు పంతులుగార్ని యిలా చూడండి అన్నట్లు సంజ్ఞచేసి నేలమీద వ్రేలితో 'కట్నం ఎంత ?'అని రాశారు. ఆయన కళ్ళజోడు చివర్నించి కోపంగా చూసి 'అలా రాయవలసిన అవసరం లేదు. మొన్న ఈ మధ్య జబ్బు చేసి నప్పట్నుంచీ యిదిగో యీ చెవికి వచ్చింది. అదైనా బ్రహ్మచెవు డేం కాదు, మరి కాస్త దిగ్గరగా కెలవిస్తే స్పష్టంగా నాటుతుంది. ఇంతకీ మనవాడుండే పట్నం ఎంత దూరమునా తమ సందేహం ? సహస్రయోజనా లుండొచ్చేమో !' అన్నాడు.

'బాపగారూ ! శల విప్పించండి-

మళ్ళీ తీరికగా కలుసుకొందాం. పదవయ్యా శాస్త్రుల్లూ-ఇలాంటిసంబంధం మాత్రం ఎప్పుడూ తీసుకురాకు. వియ్యంకుడికి వినపడదు, కనపడదు-పెళ్ళికొడుకు ఊడిపడడు, కనపడడు-చాలు!' వాళ్ళు వెళ్ళిపోతుంటే రాజ్యలక్ష్మి పకపక నవ్వుకుంది. ఇంతలో పొరుగింటికి పురాణ కాలక్షేపానికి వెళ్ళిన తులసమ్మ చేతికర్ర ఆనించుకుంటూ లోపలికి వచ్చింది. నుదుటికి అడ్డంగా అరచెయ్యి ఆనించి-

'ఎవరమ్మా, నువ్వటే సుందరమ్మా' ఎవరో అనుకున్నాను, ఎంతసేపయిందీ వచ్చి?' అంది. రాజ్యలక్ష్మి ముసిముసి నవ్వులు నవ్వుతూ,

'నేనండీ రాజ్యలక్ష్మిని .... ప్లీడరు గారి అమ్మాయిని .... కులాసాగా ఉన్నారా దొడ్డమ్మగారూ' అంది.

'నువ్వా రాజూ .... మునపట్లా చూపు ఆనడంలేదు తల్లీ, మరోలా అనుకోకు.... నీ మొగుడు బాగున్నాడా అమ్మాయీ....పిల్లలా?' అనడిగింది.

'ఇద్దరు మొగపిల్లలండి....ఆయన దగ్గిర వదిలేసి వచ్చాను....'

'ఏం చోద్యమే అమ్మాయీ...., వేలెడంత వెర్రివెధవలు వెక్కసమై అతగాడికి అంటగట్టి వచ్చేశావా? .... బాగుంది వరస .... కాము దేదీ, కనిపించిందా?'

'ఆఁ, పిల్లలికి ట్యూషన్లు చెబుతున్నట్టుంది-ఇప్పుడే వస్తానని చెప్పి ఇక్కడ కూచోబెట్టి వెళ్ళింది.'

'ఏం ట్యూషన్లో ఏం లోకమో.... ఒక్కొక్కర్తి అడుగుపెట్టిన చోట అంతా నాశనమే....'

'ఎవరి గురించి దొడ్డమ్మగారూ మీరు చెబుతూంట?'

'ఏమేవ్ రాజూ-అది నీ స్నేహితురాలైతే అయిందిగాని దాన్ని మాత్రం నాముందు వెనకేసుకురాకు, నా ఒళ్ళు మండిపోతుంది. అయినా ఇంత వయసు వచ్చాక యింక నా నోటికి అడ్డేమిటి? ఇంతకీ భగవంతుడు మా మొహాన ఇలా రాసిపెట్టేడు. ఈ ఆఖరికాలంలో కొడుకూ కోడలూ చేస్తూండగా వాళ్ల చేత చేయించుకునే అదృష్టం మాకూ లేదు-మా ఆస్తి తినే అదృష్టం వాళ్లకీ లేదు-సరేలే పడిన గోడలు పడినట్టే ఉంటాయా? మా రాము శేషు రాకనూ పోడు, మమ్మల్ని ఉద్ధరించకనూ పోడు!'

రాజేశ్వరి అర్థం కానట్టు వింటూ కూచుంది. ఇంతలో కామేశ్వరి రానే వచ్చింది.

'క్షమించు రాజూ..కొంచెం ఆలస్యమైంది.....ఈ రాత్రికి నువ్వింక రావని మీ యింటికి మా పైరివేటు కుర్రాడి చేత కబురంపించేశానులే....అలాగేనని మీ అమ్మగారి దగ్గిర్నుంచి పర్మిషన్

కూడా వచ్చింది .... ఇంతసేపూ వేచి ఉన్నావ్ .... ఈ పత్రికలు చదువుకుంటూ యింకొక అరగంట ఓపిక పట్టేవంటే ఇక ఈ రాత్రంతా మనదే.'

నిజంగా ఇంకొక అయిదు నిమషాలేనా ఉండడానికి రాజ్యలక్ష్మికి యిష్టం లేదు. కాని ఆ యింటి సంగతి పూర్తిగా బోధపరచుకోవాలనే తహతహ ఆమెను చెయ్యిపట్టుకు కూచోపెట్టింది.

చీకటి పడినకొద్దీ ముసలాయన చిరాకు ఎక్కువై పోయింది. చిన్న చిన్న విషయాలకే చిందులు త్రొక్కడము ప్రారంభించాడు.

'ఈ బిందె దగ్గర చెంబు కనపడిచావదేం? దార్లో ఈ బాల్చీ ఏమిటి? ముసిలాడు త్వరలో 'బాల్చీతన్నెయ్యాలని' యీ యింటివాళ్ళ కోరికా? ఇంట్లోవాళ్ళందరూ ఏమయ్యారు? ఒకమారే చచ్చారా ఏమిటి?'

కామేశ్వరి ఏమీ జవాబుచెప్పలేదు. ఆమె కళ్ళలో మెరుపు తగ్గలేదు, మొహంలో విసుపు హెచ్చలేదు. లోపట్నుంచి గోరువెచ్చటి నీళ్ళు తెచ్చి తండ్రి పాదాలు కడిగింది — గావంచా పెట్టి తుడిచింది. చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళి పీటమీద కూచోపెట్టింది. ఆ సరికే తులసమ్మగారు అక్కడ చేరింది.

'ఎన్ని చేసినా చచ్చిననాడు నా నెత్తిన యింత నిప్పుపెట్టేది వాడు గాని ఇది కాదు కదా! ఇంతకీ నా కన్న తండ్రి రావాలి, నా దినం తీరాలి. ఊఁ, ఆ వండిందేదో ఇలా తగలెయ్యి' అంటున్నాడు ఆయన.

'అయినా కాముడూ, అంటే ఏడుస్తావుగాని ఆ వచ్చిన అమ్మాణ్ణి అలా కూచోపెట్టి ఆ బరిచెప్పడం ఏమిటంటా? నువ్వేదో గణించి మాకు పోస్తున్నావని లోకమంతా అనుకోవాలనా? ఇంత బతుకూ బతికి ఇంటి వెనక చచ్చినట్టు ఆఖరికి నీచేత చేయించుకోడముందే మహా ప్రారబ్ధ కర్మం తల్లీ!' అని తులసమ్మ అందుకుంది. కామేశ్వరి మాటాడకుండా వడ్డిస్తున్నది. ఒకసారి తలెత్తి తండ్రి చెవిదగ్గర నోరుపెట్టి గట్టిగా 'నాన్నా అన్నయ్య ఉత్తరం రాశాడు. ఈ ఏడాదితో వాడి చదువు అయిపోతుందిట...వచ్చే ఏడు తప్పకుండా వచ్చేస్తాడుట. మీకు మరీమరీ నమస్కారాలనీ, మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమనీ రాశాడు' అంది. అప్పటికి పంతులుగారు కంచంలో చెయ్యి కడిగేసుకున్నాడు. ఈ మాట వినగానే ఆనందోద్రేకముతో మరి లేవలేక పోయాడు. కనీ కనిపించని ఆయన రెండు కళ్ళలోంచీ ఊటలూటలుగా దుఃఖం పెల్లుబికి వచ్చి రెండు చెంపల మీదా ధారలు కట్టింది.

'నా తండ్రి నా బాబు ఎంత అభిమానమో వాడికి...ఈ కాస్త చూపైనా నిలుస్తుందో లేదో, ఈ కొన ఊపిరైనా ఉంటుందో లేదో... త్వరగా వచ్చెయ్యి బాబూ...ఇంకేమి రాశావే అమ్మాయ్...ఏదీ ఆ ఉత్తరం, అదీ నా కళ్ళజోడూ ఎక్కడుందో పట్రా.'

కామేశ్వరి ఎడంచేత్తో కళ్ళనీళ్ళు తుడుచుకొని గదిలోకి వెళ్ళి అక్కడున్న శ్రీరామ పట్టాభిషేకం పటం ముందు అయిదు నిమిషాలు నిలబడి. అలాగే తండ్రి దగ్గరకు వెళ్ళడం రాజ్యలక్ష్మి గమనించింది. 'పుస్తకాలమధ్య పెట్టేను నాన్నా ... ఎక్కడ జారి పోయిందో ఎంత వెతికినా కనిపించడములేదు...సంగతులు చెప్పేనుగా!' అంది చెవిలో చెవిపెట్టి మళ్ళీ గట్టిగా.

'ఏడవలేకపోయావ్! అసలు వాడి మాటంటేనే నీకు గిట్టదు. చూస్తున్నానుగా...లేకపోతే అలాంటి ఉత్తరం అంత అశ్రద్ధగాపారేస్తావా...' తులసమ్మగారు కూడా శ్రుతి కలిపింది. వాళ్ళు అక్కడుండగానే కామేశ్వరి తండ్రిగదిలోకి వెళ్ళింది. రెండు మంచాలూ వాల్చింది. దుప్పట్లు దులిపి పక్కలు వేసింది. తండ్రి మంచంక్రింద బేసిన్ పెట్టింది. తల్లి మంచం కింద మరచెంబుతో నీళ్ళుపెట్టి అందులో రెండు వలుదోము పుల్లలు పడేసింది. ఒకప్రక్క అందుబాటులో ఉండేటట్లు ఇత్తడి చెంబుతో నీళ్ళు, తువ్వాలూ పెట్టింది. తండ్రిని నెమ్మదిగా లేవదీసి మంచంమీద కూచోపెట్టింది. గ్లాసులో మందు పోసి బలవంతాన త్రాగించింది. చేతికర్ర తీసుకెళ్ళి తల్లికిచ్చింది. నెమ్మదిగా గదిలోకి నడిపించుకు వెళ్ళింది. ఇంతలో ముసలావిడికి ఏమో విమానించింది.

"ఏమిటీ అమ్మాయ్ అది? విమానము చప్పుడు కాదూ?'

'అవు' నన్నది కామేశ్వరి.

'ఏమండోయ్ విమానం, విమానం' అని తులసమ్మగారు గట్టిగా అరచింది.

'ఒసే అమ్మాయ్, ఎక్కడ చచ్చేవే ... ముందు నా కళ్ళజోడు ఇలా అందుకో'.

ఆతృతగా కళ్ళజోడు పెట్టుకుని పడుతూ లేస్తూ ముసలాయనా, కర్ర పట్టుకుని కంగారుగా ముసలావిడా పెరట్లోకి పరిగెత్తేరు. మెడ యిరుకు పట్టేలా తల ఎత్తి కళ్ళు చించుకు చూశారు. ఆ కటిక చీకట్లో వాళ్ళకేం కనిపించిందో తెలీదు. ఏం వినిపించిందో తెలీదు.

'ఇలాంటి విమానంమీదే మన బాబు వస్తాడు....' అంది తులసమ్మ

'ను రేమనుకున్నావు? మన వాడు ఉత్తరం రాసినా విమానం మీదే వస్తుంది, నీకు తెలుసునా? రైల్లో

"నన్ను రాణీని చేస్తానని తీసుకొచ్చావు గుర్తుందా ?"
"అవును, ఇప్పుడు రాజాలే పోయారుగా ; ఇంక రాణీ లెక్కడ ఉంటారు ?"

ఉన్నట్టే విమానంలో కూడా పోస్టు డొక్కుంటుందే వెర్రిమొహమా!'

'మరి, అందులో ఉత్తరాలు పడేస్తే, దార్లో పడిపోవుటండీ?'

పంతులుగారు 'ఒహ్హో హ్హో హ్హో' అని ఇల్లెగిరిపోయేలా నవ్వేడు.

'తెలియక అడిగాను'.... దానికి పెద్ద అంత నవ్వెందుకో! ముదిమిని మూడు గుణాలు ఎక్కువౌతా యంటారు ఇందుకే కాబోలు' అని ఉన్న రెండు పళ్లూ కొరికింది తులశమ్మగారు.

'అమ్మగారూ'అని ఎవరో కుర్రాడు నెమ్మదిగా పిలుస్తే కామేశ్వరి వీధిలో కెళ్లింది.

'ఇదిగో నండీ, ఈ ఎయిర్ కండిషన్ జాకట్టు గుడ్డేమో నాలుగున్నర అయింది. కొబ్బరి బోండమేమో ఆరణాలు. మిగిలిన బేడా ఇదిగో అని' వస్తువులూ డబ్బూ అప్పజెప్పేడు. రాజ్యలక్ష్మి అంది;

'నీకేం మతిపోయిందా ఏమిటే, ఎందుకిప్పుడివన్నీ ?'

'బాగుంది. రాకరాక ఆడకూతురు యింటికొస్తే యింత పసుపూ కుంకుమా యివ్వక ఉత్తి చేతుల్తో పంపమంటావా !' అంటూ.

'అయిన ఆలశ్యం చాలు. భోంచేద్దాం లోపలికి రా' అని స్నేహితు

కామేశ్వరి

*   *   *

భోజనాలైనతరువాత వాళ్ళిద్దరికీ డాబామీద పక్కలు వేసింది. రాజ్యలక్ష్మి అటూ ఇటూ దొర్లుతూండగా కామేశ్వరి యిన్ని ఆకులూ చెక్కలూ తెచ్చి 'మా తుని తమలపాకులు జగద్విఖ్యాతి చెందినవి. నవులు' అని ముందు పడేసింది. తరువాత ఒక అయిదు నిమిషాలు కళ్ళు మూసుకుని పడుకుని చటుక్కున ఇటు తిరిగి —

'ఏమే రాజూ, మీ ఊరి విశేషాలేం చెప్పావ్ కావు? మీ రిద్దరూ అన్యోన్యంగా ఉంటారా? మీ ఆడపడుచు సంబంధం కుదిరినట్టేనా?' అని అడిగింది. రాజ్యలక్ష్మి జవాబు చెప్పలేదు.

'ముంగిలా మాటాడవేమే?'

'అబ్బే, ఇంత గడుసుదనం ఎప్పుడు నేర్చుకున్నావా అని ఆలోచిస్తున్నాను. ఇంతలా ఎప్పుడు మారిపోయావా అని ఆలోచిస్తున్నాను. నీగురించి అన్నీ తెలుసు నని అనుకునేదాన్ని. ఒక్కపూట నీతో గడిపితే నీగురించి నాకేం తెలియదని స్పష్టమైపోయింది - ఇప్పటికి, నే నొచ్చిన ఇన్ని గంటలకు తీరికైంది నీకు. ఇంకా నువ్వేదైనా చెప్తావేమో విందామని నేను సిద్ధంగా ఉండి నన్ను ప్రశ్నిస్తున్నావే. నిచమత్కారం నీకే చెల్లు'

కామేశ్వరమ్మ మృదువుగా నవ్వింది.

'నా గురించి అంత తెలియని గూడార్థ మేముందే?'

'నీకిష్టమైతే చెప్పు. లేకపోతే మానెయ్. నాకు సంబంధం నిశ్చయమైందనీ, పెళ్ళి నా కిష్టమే ననీ నీతో వచ్చి చెప్పిననాడు నువ్వేమన్నావో నాకు గుర్తులేకపోలేదు. 'సరే నీకర్మ దానికి నే నేం చెయ్యగలను? నేను మాత్రం క్లాసు లన్నీ చకచక మేడ మెట్లెక్కినట్టు ఎక్కెయ్యకమానను చదువు అంతు నేనేనా చూడాలి, నా అంతు అదైనా చూడాలి. అంతే' అనేదానివి. స్కూలుఫైనలు అయిపోగానే సెకండరీ గ్రేడు ట్రైనింగ్ అయే కర్మం నీ కేం వచ్చింది? పెళ్ళి పెడాకులూ లేకుండా ముసలితల్లిదండ్రులకు సేవచేస్తూ వాళ్ళ తిట్లూ ఛీవాట్లే ప్రతిఫలంగా స్వీకరించేయోగం నీ కేం పట్టింది? అన్నిటినీ మించి అయిదు నిమిషాలేనా ఖాళీ లేకుండా యంత్రంలా పనులు చేసుకుంటూ అతి సంతుష్టిగా కనబడే భాగ్యం నీ కేం అబ్బింది? తెలిసి చెప్పకపోయావో...

'నా కేం అవదు గాని అర్థం కాక నీ తలే వెయ్యి చెక్కలౌతుంది. విక్ర

మార్కుడంత వెర్రి దాన్ని కాదు నేను, బేతాళీ!'

'ఇద్దరూ నవ్వుకున్నారు. నెమ్మది నెమ్మదిగా కామేశ్వరి ఆరంభించింది.

'నీదగ్గర నా రహస్యాలు దాగవు. నేనే దాచుకోలేను.... తెలుసుకున్నది ఎంతటి రహస్యమైనా బడబానలంలా కడుపులో పెట్టుకుని కడలిలా గడప గలవని నాకు తెలుసు. అందుకే నిన్ను ఇవాళకి ఉంచేశాను.

రాజ్యలక్ష్మి నిశ్శబ్దంగా వింటోంది. కామేశ్వరి క్రిందికెళ్ళి ఒక కవరు తెచ్చి ఇది చదువు. అంతా నీకే తెలుస్తుంది' అని ఆమె కిచ్చింది.

'ప్రియసోదరి కామేశ్వరికి-మీఅన్న రామశేషారావు అనేక ఆశీర్వచనలు. అమ్మా నాన్నా కులాసాగా ఉన్నారని తలుస్తాను .... వారికి నా హృదయ పూర్వక నమస్కారములు అంద జెయ్యి. అదెంతటి నిప్పులాటిదయినా నిజం అనేది ఎప్పటికయినా బయట పెట్టక తప్పదు. నాకు రెండేళ్ళక్రితమే పెళ్ళయింది. అమెరికన్ యువతిని పెళ్ళి చేసుకున్నాను. ప్రస్తుతం ఒక మగబిడ్డ కూడా. ఇంక మూడేళ్ళలో యిక్కడ పద్ధతులప్రకారం అమెరికా పౌరుడిగా నేను పరిగణింపబడతాను.



నేను ఇక్కడ స్థిరపడిపోయాను నేను వస్తానని ఇక ఎటువంటి ఆశా పెట్టుకో వద్దు. ఇంతకీ ఇంత గా చదువుకుని నే నా పల్లెటూరు వచ్చి బావుకునే దేముంది ? ఇదే నా ఆఖరి ఉత్తరం. జవాబు వ్రాయొద్దు.'

రాజ్యలక్ష్మి తన కళ్ళను తనే నమ్మ లేకపోయింది. అది నిజమా కలా అని ఆ ఉత్తరం పరీక్షించడంలో ఆమెకు దారుణమైన మరొక సత్యం తెలుసు కొచ్చింది. ఆ లేఖ రెండేళ్ళ క్రిందటిది!

'ఈ లేఖ చేరేసరికి నేను పియ్యూసీ చదువుతున్నాను. నాన్నగారి దృష్టి సరిగా ఉండదని అన్నయ్యకు ఎప్పుడూ నా పేరనే ఉత్తరాలు వ్రాసేవాడు. అంతకుముందు ఒక నెల క్రిందట నాన్న గారికి 'హార్టు ఎటాక్' వచ్చింది. డాక్టరు గారు నన్ను పిలిచి'

'అమ్మాయ్, మీ నాన్నగారి స్థితేం బాగులేదు. బ్లడ్ ప్రెషర్ బాగా ఎక్కు వగా ఉంది. ఆయనకి పూర్తిగా విశ్రాంతి ఇయ్యాలి. ముఖ్యంగా మనస్సు వ్యాకులపడే విషయాలేమీ చెప్పకూడదు .... పూర్తిగా 'సాల్ట్ లెస్ డయిట్' యివ్వాలి. నువ్వు చూస్తే చిన్నపిల్లలా వున్నావు...మీఅన్నయ్య ఎక్కడో ఫారెన్‌లో ఉన్నాడని విన్నాను. ఆయన్ని పిలిపించు ..మళ్ళీ మళ్ళీ యిలా ఎటాక్సు వస్తే ఈయన బ్రతకడం కష్టం ఏమయినా నా నమ్మకాన్నిబట్టి ఒక ఏడాది దాటదు అని చెప్పేరు. అన్నయ్యకు అన్ని విష యాలూ రాద్దామనుకొంటూండగా వాడి దగ్గిర్నుంచే యిప్పుడు నీకు చూపించిన ఉత్తరం వచ్చింది. ఆ పరి స్థితుల్లో నాకు దిక్కూ దరీ తోచలేదు. మొట్టమొదట స్వార్థపరుడని అన్న య్యని నోటికొచ్చినట్లు తిట్టు కున్నాను. అంతట్లో నాకే అనిపిం చింది 'వాడు వచ్చిమాత్రం ఏం చెయ్యాలి గనుక? ఇలాంటి చిన్న ఊళ్ళో వాడి చదువుకు సరిపడే ఉద్యోగం ఏం దొరుకుతుంది గనుక? వాడిసైనా సుఖపడనీ' అని నేనే సర్ది చెప్పుకున్నాను. మా అమ్మ బొత్తిగా లోకజ్ఞానం లేనిది. ఏ పురాణానికో హరికథకో వెళ్ళి ఎలాగో కాలక్షేపం చేసుకుని రాగలదు. మరి నాన్న మాట? ఆయన బాధ్యత ? ఆయనకి యింతటి రోగంలో భయంకరమైన ఈ సత్యం ఎలా చప్పను ?' కామేశ్వరి ఆ ఉత్త రాన్ని ముక్కముక్కలుగా చింపే సింది.

'అది ఆనాడు నేను చూశాను ఇప్పుడు మళ్ళీ నువ్వు చూశావు అంతే....ఇక ఈ సత్యం నాతో పోవల సిందే'

కామేశ్వరి కొంచెం మంచినీళ్ళు త్రాగింది చన్నీళ్ళతో మొహం కడు



"ఎవరి దా నీడ, అలా భయపడిపోతున్నా దేమండీ ?"
"వాడి భార్యా నీడ అయ్యుంటుంది !"

క్కుంది. మళ్ళీ చెప్పడం ప్రారంభిం చింది.

'నాన్నగారి జబ్బులకి మందుల కని డబ్బు చాలక - మాకొక పదెకరాల పొలం రాజవరంలో ఉండేదిలే - మూడేళ్ళనుండీ శిస్తులు బకాయి. శిస్తులు వసూలు చేసుకువద్దా మని ఒక సారి నేనే బయలుదేరి వెళ్ళేను. కరణం గారు చెప్పిన మాట విని ఆశ్చర్య పోయాను. నాన్నగార్ని గుడ్డివారిని చేసి అన్నయ్య' అప్పుడే ఆ భూమి తన పేర రాయించుకున్నాడట. ఒక మధ్య వర్తిద్వారా అన్నయ్య ఆ భూమి అమ్మించి రెండేళ్ళు దాటిందిట! నేను ఇంటికి వచ్చేసరికి నాన్నగారికి మళ్ళీ ఎటాక్ వచ్చి అప్పుడప్పుడే కొంచెం తగ్గుతోంది. ఈ కబురుమాత్రం ఆయ నతో ఎలా చెప్పేది? అన్నయ్య అక్కడ స్థిరపడిపోయా డన్న విషయం చెబితే ఆయనగుండె బ్రద్దలవుతుంది. సందేహం లేదు. నా చేత్తో నేను ప్రాణం తీసినదా న్నవుతా నని ఆ సంగతి కప్పెట్టేను. దానితోపాటే ఇదీ దాచాను. కన్నవారి కన్నుగప్పిన నా నేరానికి ఆ పట్టాభి రాముడే సాక్షి. ఆ పరిస్థితుల్లో అంత కన్న చేసేదేముంది? ఇంక చెప్పడాని కేముంది? చదువుతున్న చదువు చాలించి ట్రెయినింగ్ అయిపోయాను. అదృష్టవశాత్తూ ఇక్కడ హైస్కూల్లోనే ఉద్యోగం అయింది. నాన్న మందులకీ, పళ్ళకీ, టానిక్కులకీ చాలదని ఓ అర డజనుమందికి ప్రైవేట్లుకూడా చెబు తున్నాను. నేను పోషించకపోతే ఈ రోజుల్లో ఈ అద్దెకొంపలో వెర్రిబాగుల మా అమ్మ, పిచ్చివాడైన మా నాన్న బ్రతికేది ఎలా? కాని వాళ్ళకి మొట్ట

మొదట్నుంచీ మొగపిల్ల లంటేనే పిల్ల లని అభిప్రాయం. ఎందుకూ పనికిరాని ఆడముండచేత పోషించబడడం వాళ్లకి ఎంతమాత్రం యిష్టంలేదు. కానియ్యి. వాళ్ళ అభిప్రాయాల్ని కాదనడ మెందుకు? అమాయకుల్ని మోసం చెయ్యడం ఎంతసేపు? నా జీతం నూరు రూపాయలైతే ఏభై అనే చెప్పేను. పైవేట్లు ఊరికే చెబుతున్నానని చెప్పేను. అన్నయ్యే నెలకి కనీసం యాభై రూపాయిలు అక్కణ్ణుంచి పంపుతున్నాడనీ, ఆడబ్బే ఖర్చుపెడుతున్నాననీ చెబుతూ వస్తున్నాను. అప్పుడప్పుడు అన్నయ్యదగ్గిర్నుంచి వచ్చే ఉత్తుత్తి ఉత్తరాలు చదువుతూ వుంటాను. ఈ వంచన ఎందుకో తెలుసా రాజూ?'

రాజ్యలక్ష్మి జవాబుచెప్పే స్థితిలో లేదు. ఇరవై ఏళ్ళు వచ్చినా ఆ వయసుకి సరిపడ పొడవుగాని వెడల్పుగాని లేక సన్నగా పీలగా వున్న మనిషి, వెనక్కి వంకర తిరిగిన జానడే జానడు జడగల మనిషి, ఒక చాయ నలుపే గాక స్ఫోటకం మచ్చలు మొహం నిండా వున్న మనిషి-కురుస్తున్న మానవత్వంతో మెరుస్తున్న నేత్ర ద్వయంతో ఇంతటి సర్వాంగ సౌందర్య శోభా విలాసిని ఎలా అయినట్టు!

'నువ్వే విన్నావుగదూ రాజూ, నడవలేరు, కదలలేరు .... అయినా నాన్న ఆకాశంవైపు కటిక చీకట్లో అయినా కన్ను చించుకు చూస్తారు, వాడి సంగతి తెలిక పిల్ల నిస్తామని ఎవరైనా వస్తే చాలు గంటల తరబడి వాణ్ణి పొగుడుతారు. అన్నయ్య గురించి ఆలోచించడంలో, ఎన్నాళ్ళయినా ఎదురు చూడ్డంలో ఆయనకు విసువులేదు. అదే ఆయన ఆశ. అదే ఆయన ఆకర్షణ. అదే ఆయన ఆయుర్దాయం!' చూస్తూండగా కామేశ్వరి కళ్ళు భాష్పపూరితా లయాయి.

'ఏమే రాజూ! దాచక నాతో చెప్పు. క్రిందటిసారి వచ్చినప్పుడు నాన్నని చూశావ్, ఇప్పుడు చూశావ్ ఆయన స్థితిలో మార్పేమేనా కనిపించిందా? ఆయన యింకా బతుకుతారంటావా? ఎల్లకాలం నేనీ విధంగా మోసం చెయ్యగలనంటావా?' రాజ్యలక్ష్మి కామేశ్వరి రెండు చేతులూ కళ్ళ కద్దుకుంది; వణుకుతున్న కంఠంతో ఇలా అంది:

'మీ నాన్నను కన్న తల్లిదండ్రు లెవరో వాళ్ళెక్కడున్నా నిన్ను తప్పక దీవిస్తారు. నీ పట్టాభిరాము డెవడో ఆ దేము డెక్కడున్నా నిన్ను ఆశీర్వదిస్తాడు. ఆత్మార్పణ చేసుకుని మీ నాన్నగారికి ఆశ చూపించి ఆయుస్సు పోశావు. నిజానికి నీకన్న పైచదువులు చదువుకున్న దెవరు?'